# నాకూ వరకట్నం కావాలి

**- శారదా ప్రసాద్**

"ఇక్కడ కిరణ్ అంటే..." అడుగుతూ అర్థోక్తిలో ఆగిపోయాడాయన.

"నేనే. లోపలికి రండి" ప్రతి అక్షరంలోనూ వినయం, వినమ్రత పొర్లిపోయేలా నింపి పలికాను. వచ్చిన పెద్దమనుషులిద్దరూ హుందాగా లోపలికొచ్చి కూర్చు న్నారు. టేబిల్ ఫ్యాను ఆన్ చేసి, వాళ్ల ఎదురుగా వెళ్లి కూర్చున్నాను.

"ఎడ్రెస్‌నిబట్టి మీ రూమ్ పట్టుకోవడం కొంచెం కష్టమే" పడ్డ శ్రమనంతా మాటల్లోంచి, కళ్లలోంచి కుమ్మరించాడొకాయన కళ్లజోడు తీసి పట్టుకుంటూ.

"ఆటోలో వస్తే ఈజీగా వచ్చేవారు. దేవీ టాకీసు ఎదురుగా వున్న రోడ్డంటే అందరికీ బాగా తెలిసిందే" సమాధానం అంటూ చెప్పాలని అన్నాను.

"అదేలెండి, అలానే అడిగి తెలుసుకున్నాం. మీ నాన్నగారు అలానే ఇచ్చారు మీ ఎడ్రెస్. మీకూ ఉత్తరం రాస్తానన్నారే" అన్నాడు రెండో పెద్దమనిషి.

"రాశారండి. జగపతిరావుగారు, ఆయన అన్నగారూ కలిసి వస్తారని" ఆ ఇద్దరిలో ఎవరు ఎవరో తెలియక ఇద్దరినీ మార్చి మార్చి చూస్తూ అన్నాను.

"నేనే జగపతిరావుని. ఈయన మా అన్నయ్య ప్రభాకరం" పరిచయ వాక్యాలు పలకాలని ఇప్పటికి తోచిందాయనకి. నమస్కార బాణం వేసే సమయం మించిపోయినందుకు, ఆ బాణం నా దగ్గరే మిగిలిపోయింది. నా ఇమేజ్ ఆయనలో ఎలాంటి ఇంప్రెషన్ కలిగిస్తున్నదో ఎక్స్‌రే కళ్లతో చూడసాగాను ఆయన కదలికలన్నీ. ఎందుకంటే తన కుమార్తె సీతాదేవికి వర నిర్ణయం చెయ్యడానికి బయలుదేరిన జనక మహారాజు ఆయనే.

ఫ్యాను గాలికి చెమటలు ఆరి కాస్త ఒళ్లు చల్లబడినట్టుంది. ఇక మొదలుపెడదామా అన్నట్టు ఒకరినొకరు చూసుకుని, హఠాత్తుగా నావైపు తిరిగారిద్దరూ.

"మీరు జాబ్ చేస్తున్నది స్టేట్ గవర్నమెంటా, క్వాజీ గవర్నమెంటా?" ప్రభాకరంగారి ప్రశ్న దూసుకొచ్చింది.

"ప్యూర్లీ స్టేట్ గవర్నమెంటు జాబేనండి" గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కున్న వెయిట్ తెలిసి, రవ్వంత గర్వం జోడించి చెప్పాను.

"సీనియర్ స్టెనోగ్రాఫరా మీరు?" జనక మహారాజుగారి ధర్మ సందేహం.

ఔనన్నాను.

"సీనియర్ అసిస్టెంట్ స్కేలూ, మీదీ ఒకటేనా?" ప్రశ్నల పరంపర మొదలైంది.

"ఎలవెన్సెస్‌తో కలిపి కొంచెం ఎక్కువే అవుతుంది"

"తరువాతి ప్రమోషన్స్ ఎలా వుంటాయి?" జగపతిరావుగారు అడిగిన ప్రశ్నలో వాళ్ల అమ్మాయి భావి జీవితపు సుఖశాంతుల గురించిన ఆతృత సుస్పష్టంగా క(వి)నపడింది.

"సెక్షన్ హెడ్స్‌కి, హయ్యరథారిటీస్‌కి పిఏగా వెళ్లొచ్చు" పెద్ద పొజిషన్‌లో వున్న అల్లుడి గురించి పంచరంగుల కల కనమని అమ్మాయి తండ్రికి బోలెడు స్టఫ్ ఇచ్చాను.

"మరి బదిలీలు ఎలా వుంటాయి?"

"ఆల్మోస్ట్ మనం అడిగేవరకూ కదపరు. ట్రాన్స్‌ఫర్లయినా వితిన్ ది స్టేటే వుంటాయి."

దేశం ఉత్తర ధృవానికో, దక్షిణ ధృవానికో వాళ్ళ అమ్మాయిని లాక్కుపోతానేమోనన్న ఆయన అనుమానం తీరేలా చెప్పాను.

"ఎన్నాళ్లయింది మీరీ ఉద్యోగంలో చేరి?" ప్రభాకరంగారు అడిగారు.

"టూ ఇయర్స్ దాటింది."

"టెంపరరీ కాదన్నారే మీవాళ్లు?"

"ఔనండి నెలక్రితమే పర్మనెంటయింది" మరో మెరుపు మెరిపించాను.

ఇద్దరి బుర్రలూ ఒకేసారి ఖాళీ అయ్యాయి కాబోలు, కుర్చీల్లో వెనక్కి జారబడి కూర్చున్నారిద్దరూ.

ప్రశ్నల జల్లు తగ్గిందనిపించాక, "జెస్ట మినిట్" అంటూ లేచి, ఆ ఇద్దరి కోసం ముప్పైరూపాయలు ఖర్చుపెట్టి తెచ్చిన కేకులు, బిస్కెట్లు ప్లేట్లో పెట్టి వాళ్ళముందు పెట్టాను.

"శ్రమ తీసుకున్నారు మా గురించి" మొహమాటం జగపతిరావుగారి కళ్లలో మెరిసి మాయమైంది.

"మీరూ తీసుకోండి" ప్రభాకరంగారన్నారు.

"మీరు ముందు తీసుకోండి" పండువెన్నెల కళ్ల నిండా కాసేస్తున్న జగపతిరావుగారిని ఓరకంట చూస్తూ అన్నాను.

నా అడ్రెస్ కోసం టిఫిన్లు కూడా తినడం మానేసి తిరిగారో ఏమో, నన్నింకేం మాట్లాడించకుండా, ఒకరినొకరు చూసుకోవడం కూడా మానేసి ప్లేట్లు ఖాళీ చేసేసారు. మెగా కోక్ ఓపెన్ చేసి గ్లాసుల్లో పోసి ఇచ్చాను. జగపతిరావుగారు మరోసారి సిగ్గుతో ముడుచుకుపోయి, తిరిగి మామూలుగా సాగిపోయి డ్రింగ్ తాగేశారు.

"అమ్మాయి బిఏ చదువుతూ మానేసింది" కొద్దిపాటి మౌనం అనంతరం హఠాత్తుగా అన్నారు ప్రభాకరంగారు.

ఇక వధువు వన్నెచిన్నెల వర్ణనల జల్లు మొదలైందనిపించింది నాకు.

"పెళ్లి చేసేద్దామని నేనే చదువు మానిపించేశాను" నా కళ్లలోని ప్రశ్నార్థకాలు చూసి జగపతిరావుగారు నా అనుమానం తీర్చేశారు.

'ప్యూరిండియన్ ఫాదర్' లోలోపలే గొణుక్కున్నాను.

"మీ రంగులోనే వుంటుంది. వంటా, వార్పూ అంతా బాగానే వచ్చు. కాలేజీ చదువు చదివినా వినయానికీ, అణుకువకూ ఏ మాత్రం లోటులేదు. సన్నగా వుంటుంది" అమ్మాయి రూపురేఖలు, గుణగణాలూ కళ్లకు కట్టించేస్తున్నారిద్దరూ కలిసి.

"ఈరోజుల్లో కాలేజీ అమ్మాయిల్ని చూస్తున్నారుగా. తిండి తినరు. నాజూకు భోజనాలే" సంజాయిషీతోబాటు నచ్చజెప్పే తీరు కూడా ధ్వనించింది జగపతిరావుగారి మాటల్లో. ఇద్దరూ నవ్వారు. నేనూ నవ్వాను.


"అమ్మాయి హైటెంతరా జగం?" అటు తిరిగి అడిగారాయన.

"అయిదూ ఒకటి" ఆయన జవాబు.

"కొంచెం ఎత్తరే. మీ భుజాలవరకూ వుంటుంది" మాటల్లోనే అమ్మాయిని నాపక్కన నిలబెట్టి చూసేస్తున్నారు.

"సీత ఫొటో ఇచ్చాం. మీరూ చూసే వుంటారు" నా ఇష్టాఇష్టాలను ఒక్కముక్కలో తేల్చి చెప్పమన్నట్టుంది ఆ మాటల్లోని ప్రశ్నార్థకం.

"చూశానండి" కావాలనే ఆ తరువాతి మాటలను బైటకు చెప్పకుండా మింగేశాను. ఆ సస్పెన్స్ ఇద్దరినీ గుటకలు మింగించింది.



నా కళ్లముందు రెండుజడల ఆ అమ్మాయి ఫొటో మెదిలింది ఒక్కసారి... పువ్వుల చీర, తెల్లటి జాకెట్, ఒంటిపేట గొలుసు, కళ్లనిండా కాటుక, జారే నీటి చుక్కలా బొట్టు, చెవులకు బుట్టల జూకాలు, కెమెరాను చూసి నవ్వటం కూడా మరచిపోయి, కళ్లు పెద్దవి చేసేసిన ఆ అమాయకత... అన్నీ ఒక్కమారు గుర్తొచ్చాయి. నచ్చిందని మెచ్చుకోలుగా అందామనుకున్నాను. కానీ ముందుగా దండ వేయించుకోవలసింది నేనేనని గుర్తొచ్చి, బెట్టు చూపించవలసి వచ్చింది.

"అయినా అదేదో పరీక్షలకని తీయించిన ఫొటో లెండి. ఇప్పుడు మరికొంచెం ఒళ్లు చేసింది అమ్మాయి'' తనకు తోచిన ఒక ప్లస్‌పాయింట్ అడ్డువేశారు జగపతిరావుగారు.

"అది వాళ్ల అమ్మ పోలికరా. రానురానూ ఆ విగ్రహం ఎలానూ వచ్చేస్తుంది'' రెండు పిట్టలకూ తగిలేలా ఒకే రాయి విసిరారు ప్రభాకరం గారు. అదేమాట నాతోనూ చెప్పినట్లయింది.

వాళ్లమ్మ 'విగ్రహం' నేనింకా చూడలేదుకాబట్టి నా ఊహాలోకంలోని స్క్రీను మీద ఏ బొమ్మా కనపడకుండా ఖాళీగా వుండిపోయింది.

"వచ్చేవారంలో ఓరోజు మీరు ఆఫీసుకు లీవు పెట్టాల్సి వుంటుంది. అమ్మాయిని చూడటానికి రావాలి మీరు. డేటు ఖరారు చేసుకుని, మీ నాన్నగారికి, మీకు తెలియబరుస్తాము'' ప్రభాకరంగారే మళ్లీ అన్నారు.

"అలాగే'' అన్నాను నేను.

"ఇక వెళదాం మరి. బండికి టైమవుతోంది'' జగపతిరావుగారి మాటతో ఇద్దరూ లేచి నుంచున్నారు.

వాళ్లిద్దరినీ వీధి చివరివరకూ సాగనంపి తిరిగి వచ్చాను. తలుపులు గెడపెట్టి, సూట్‌కేసులోంచి సీత ఫొటో తీసుకుని పట్టుక్కూర్చున్నాను. చూస్తున్నకొద్దీ ఆ ఫొటోలోని సీత పెదాలు కదుల్తున్నట్టు, నవ్వుతున్నట్టు, కనురెప్పలు మూసి తెరుస్తున్నట్టు అనిపించి, నాకు తెలియకుండానే టైము గడిచిపోయింది.

★★★

ఆ తరువాతి వారంలో శెలవుపెట్టడం, సీతను చూడటం జరిగింది. ఆరోజు మా ఇద్దరి మనసుల్లో పువ్వుల వానల జల్లులు కురిశాయి. మెరిసే కళ్లతో ఇద్దరం చూసుకున్నాం. ఆ తరువాత జరిగే ఘట్టాలు ఆందోళనకరంగా, ఇబ్బందికరంగా వుంటాయి అందరి విషయంలో. పెళ్లికుమారుణ్ణి అటు వరకట్నాన్ని ఇటు త్రాసులో వేసే ఘట్టం అది. మగపెళ్లివారు అబ్బాయికి వున్న ప్లస్ పాయింట్లు ఒక్కొక్కటీ బైటపెడుతూ రాగాలు తీస్తూ, అటు పక్క పళ్లెంలో బరువులు వేస్తూ త్రాసును అటు ఎగలాగుతుంటే, ఇటు ఆడపెళ్లివారు తమ శక్తిమేరకు...

ఒక్కోసారి శక్తిమీరి కూడా ధన కనక వస్తు వాహనాలను ఇటు ప్రక్కపళ్లెంలో వేసి, తిరిగి త్రాసును ఇటు దిగలాగుతుంటారు. అలా ఆ త్రాసు తాలూకు ముల్లు ఒకసారి అటు, మరొకసారి ఇటూ ఊగుతూ, వగలుపోతూ, వయ్యారాలుపోతూ, సంబంధం కుదిరిందన్నట్టు, చెదిరిందన్నట్టు, సంజ్ఞలు చేస్తూ, సంకేతాలిస్తూ వుంటుంది. ముఖ్యంగా ఒకళ్లకొకళ్లు బాగా నచ్చేసిన అబ్బాయి, అమ్మాయిల హృదయ కుసుమాలను భయాందోళన, ఆనందేతిహాసాల్లో ముంచి తేలుస్తూ వుంటుంది.

"ఇక కట్నకానుకలూ అవీ మాట్లాడుకుంటే..." జగపతిరావుగారన్నారు.

కానీ, ఈ విషయంలో నేను కృతనిశ్చయుడను. వరకట్నం వద్దంటూ భీషణ ప్రతిజ్ఞ చేసి వున్నవాడను. ఆ విషయం గుర్తొచ్చి, మా నాన్నగారు నుదురు నూట ముప్పై ముడుతలు వేసి నావేపొకసారి చూశారు బాధగా. నేను మాత్రం సభామర్యాదను పాటిస్తూ చిరునవ్వుతో వుండిపోయాను. ఆయన అటువేపు తిరుగుతూ, సభ్యతా సంస్కారాలు కృత్రిమంగా పులుముకున్న తన ముఖాన్ని వీలైనంత నవ్వులమయం చేసుకుని-

"మావాడు వరకట్నానికి సంపూర్ణ వ్యతిరేకి. నా కన్నకొడుకును నా నోటితో పొగుడుకోవటం బాగుండదుకాని, వాడికున్న సంస్కారం ఎంతో వున్నతం. యువతరానికి ఆదర్శం" అన్నారు టోన్ మాడ్యులేషన్ విపరీతంగా మార్చేస్తూ.

అప్పుడా గదిలో ఆరేడు ఫ్లాష్ బల్బులు వెలిగాయి చకచకా. జర్నలిస్టులెప్పుడొచ్చారా అని తలెత్తి చూశాను. అప్పుడర్థమైంది అవి ఫొటోలు కావు, ఆ వెలుగు ఆడపెళ్లివారి ముఖాల్లో వెలిగిన వెలుగులని. వాళ్లందరూ ఆరాధనాపూర్వకంగా నన్ను చూస్తుంటే పెళ్లికూతుర్లా నేనే తలదించుకోవాల్సి వచ్చింది. ఇక ఆపై జరిగిన కోలాహలంలో ఆడపెళ్లివారి అందరి గొంతులూ వినిపించాయి చెవులు చిల్లులు పడేంత హైపిచ్‌లో. తలొకళ్లూ తలొక జోక్ వేశారు ఆ ఆనందంలో. అందరితోనూ కలిసి మా నాన్నగారు నవ్వుతున్నారు, మాట్లాడుతున్నారు. కానీ నా ఒక్కడికే ఆయన గొంతు నూతి లోంచి వస్తున్నట్లుగా వినపడిందా రోజు.

★★★

ఇది గడిచిన వారంరోజుల తరువాత ప్రతిరోజూ పోస్ట్‌మాన్‌కి మా ఆఫీసు మొత్తం జనాభాలో నేనొక్కడినే హృదయపూర్వక స్వాగతం పలికేవాడిని. అతను ఉత్తరాల కట్టకోసం సంచిలో చెయ్యిపెడుతుంటే, చేతిలో ఇమిడిపోయే చిన్న బొమ్మసైజు సజీవ సీతను నా చేతికి తీసి ఇస్తున్నట్లు వుండేది నాకు. రోజూ అతన్ని చూడగానే నవ్వేవాడిని. 'హలో' అనేవాడిని. దగ్గరగా వెళ్లి "మా నాన్నగారి నుంచి ఉత్తరం వచ్చిందా" అని అడిగేవాడిని.

"మీ నాన్నగారే కాదండి. ఎవరు మీకు ఉత్తరం రాసినా తెచ్చి ఇస్తాను నేను" అని నవ్వేవాడతను. ప్రతిరోజూ ఇదే సీను రిపీటయింది రెండువారాల పాటు.

ఎవ్వరి నాడీమండలమైనా విచారాన్ని కాని, వినోదాన్ని కాని ఒక మోతాదుమించి భరించలేదు. ఆ విషయంలో నా నరాలు మరీ సెన్సిటివ్. ఆరోజు సాయంత్రం మొద్దుబారిపోయిన నా తలను తడుముకుంటూ 'నేపియార్' ఓపెనెయిర్ రెస్టారెంట్‌లో కూర్చొని కాఫీ సిప్ చేస్తున్నాను. ఇంతలో వెనుకనుంచి నా భుజాల మీద రమారమి ఇరవై కేజీల బరువైన రెండు చేతులు పడటంతో ఉలిక్కిపడి తల వెనక్కి తిప్పిచూశాను. కళ్యాణరావు నవ్వుతూ కనిపించాడు.

కళ్యాణరావు నా హైస్కూలు సహాధ్యాయుడు. స్కూలు చదువులు ముగిశాక, వాడిని వాళ్ల నాన్న లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి సూపర్ డీలక్స్ బస్సు ఎక్కించి, గతుకులు లేని జీటీరోడ్డు మీద ప్రయాణం చేయించాడు. తత్కారణాన ఈ పదేళ్లలో వాడొక ఇంజనీరై కూర్చున్నాడు. ఉద్యోగం సంపాదించి, ఇదే సిటీలో 'ఇంజనీరుగారు' కూడా అయ్యారు. లక్షల పెట్టుబడి మహిమ అది. లక్షల్లోనే రాబడి తెస్తుంది. విటమిన్ 'ఎమ్' లోపం ఏనాడూ లేకపోవడంవల్ల వాడు నిర్విచారంగా, సదానందంగా పెరిగి, ఆరోగ్యంతో నిగనిగలాడుతూ, ఏపుగా ఎదిగిపోయాడు. అప్పుడప్పుడూ కలుస్తుంటాడు.

చూసి పలకరింపుగా నవ్వాను నేను.

"ఏరా! దేవదాసు ఫోజుపెట్టి కాఫీ తాగుతున్నావూ" అంటూ పక్క కుర్చీలో కూలబడ్డాడు.

"ఆ మాసిన గెడ్డం, దువ్వని జుట్టూ, ఏవిట్రా నీ అవతారం. ఆరుగురు పిల్లల తండ్రిలా?" సరదాగా జోకుమీద జోకులేస్తూ నా జబ్బ పట్టుకుని పిండేస్తున్నాడు వాడు. సున్నితంగా ఆ పట్టు విడిపించుకుని,

"వూ! చెప్పరా పిల్ల జమీందారూ, ఏవిటి విశేషాలు?" అన్నాను.

"అసలు నీకో విషయం చెప్పడానికే నిన్ను పట్టుకోడానికని నాలుగు రోజుల నుండీ తిరుగుతున్నాను. నువ్వు దొరకలేదు. కానీ ఆ విశేషం నువ్వే చెప్పేస్తున్నావు నాకంటే ముందు."

"నేనా?"


"ఔన్రా! పిల్లజమీందారూ అన్నావుగా. ఇంకొక్క



## నిలకడలేని తార

అందాలతార ఐశ్వర్య ఈమధ్య ఓ షూటింగ్‌లో గాయపడిన తరువాత ఆమె అభిమానులెంతో ఆరాటపడ్డారు. 'ఆమె నటుడు వివేక్ ఒబెరాయ్‌తో తిరుగుతోంది' అంటూ రూమర్లు కూడా వచ్చాయి. సల్మాన్‌తో ఆమె సంబంధం గురించి కూడా జనం కోడై కూసారు. 2005 వరకూ ఆమె కెరీర్‌లో నిలకడ ఉండదని ఆస్ట్రాలజర్ అనుపమ్ కపిల్ అంటున్నాడు. వివేక్‌కి చెందిన జన్మకుండలి, ఐశ్వర్య జన్మకుండలి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కలుస్తున్నాయిట. కాబట్టి రూమర్లు నిజం అవుతాయంటున్నారు. ఎన్ని సంఘటనలు జరిగినా ఐశ్వర్య కెరీర్‌కొచ్చిన ఢోకా ఏమీలేదని భరోసా ఇస్తున్నాడా ఆస్ట్రాలజర్.

– రాజు



నెలరోజుల్లో ఈ జమీందారు పక్కన ఒక పిల్ల రాబోతోందిరా'' కళ్లెగరేస్తూ బుగ్గలు పొంగిపోయేలా నవ్వేస్తూ అన్నాడు వాడు.

ఒక్క క్షణంలో నాలోని స్తబ్దత అంతా ఎగిరిపోయింది. వాడికి పెళ్లని వినగానే ఎక్కడలేని ఆనందం కలిగింది నాకు.

"హార్టీ కంగ్రాట్స్‌రా'' షేక్‌హేండిస్తూ అభినందించాను వాడిని.

"ఏవూరు అమ్మాయిరా?''

వూరు పేరు చెప్పాడు వాడు. నాకూ అదే వూరి నుంచి సంబంధం వచ్చిందని చెప్పాలని నోటి చివరివరకూ వచ్చింది. కానీ, నా సిక్స్త్‌సెన్స్ నాకేదో వార్నింగ్ ఇవ్వడంతో నాలో అనుమాన బీజం నాటుకుని గొంతు పట్టేసింది.

"పేరు''

"సీత. ఎలా వుంది పేరు? సీతా కళ్యాణ్ అంటే ఎలావుందిరా? సినిమా పేరులా లేదూ గమ్మత్తుగా!'' నవ్వుతున్నాడు వాడు. నన్ను వాటేసుకుంటున్నాడు, వదులుతున్నాడు. ఇంచుమించుగా గాలిలో తేలుతున్నాడు.

"బావుంటుంది'' నా మాట నాకే వినబడలేదు. నాలో నాటుకున్న అనుమాన బీజం అప్పుడే రెండు చిగురుటాకులు కూడా తొడిగింది.

"వాళ్ల ఫాదర్ పేరు జగపతిరావు. లాండ్ లార్డ్. పొలాలున్నాయి'' ఇంకా చెప్పుకుపోతున్నాడు వాడు. ఈలోకం నుంచి ఎప్పుడో వేరుపడిపోయాడు వాడు. మరోలోకంలోకి పోయి మాట్లాడేస్తున్నాడు అడ్డూ ఆపూ లేకుండా.

"ఒక్కతే అమ్మాయి. నో బ్రదర్స్. అంటే వాళ్లకి అన్ని దిక్కులూ మనమే.''

నా చూపులు వాడిమీద నిలిచిపోయాయి. చెవులు వినేస్తున్నాయి. పెదాలు సన్నగా సాగి చిరునవ్వు నవ్వేస్తున్నాయి. కానీ నా కాయం మాత్రం ఆ వివరాలు వింటూ ఒకటొకటిగా ఎగిరిపోతున్న పంచప్రాణాలను అదిమిపట్టి, ఆత్మను పరమాత్మలో లీనం కాకుండా చూసేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది లోలోపల. అన్ని వివరాలూ చెప్పటం పూర్తి చేశాడు వాడు. ఆయాసం తీర్చుకున్నాడు. అప్పుడు నన్ను కుదిపి...

"ఒరే పక్షీ... ఏవిట్రా ఆ వెర్రిచూపు? వింటున్నావా?'' అన్నాడు.

అప్పటికి నాలోని అనుమానపు బీజం పూర్తిగా మొలకెత్తి, మ్రానై, కొమ్మలూపుతూ, భయంకరంగా వూగుతూ, నిలువెత్తున నిలబడి వుంది.

"అమ్మాయి ఎలా వుందని అడగవేరా?'' తరిగిపోయిన ఓపికంతా తిరిగి వచ్చిన తరువాత మళ్లీ హుషారుగా అడిగాడు వాడు.

"చెప్పరా చెప్పు. నువ్వు ఒక్కడివే బాగా వర్ణించి చెప్పగలవ్ మరి'' అన్నాను వ్యంగ్యంగా.

నా మాటల్లోని వ్యంగ్యం వాడికర్థం కాదీ జన్మకు. నాకు తెలుసది.

"చెప్పటానికి మాటలు చాలవుకాని, ఇదిగో ఫొటో చూసి ఏడు. సస్పెన్స్‌లో పెట్టాలని ఇంతసేపూ చూపించలేదు'' కవరు తీసిచ్చాడు జేబులోంచి. ఆ కవరు చూడగానే నా తల అచ్చం సినిమాల్లో చూపించే మోడల్‌లోనే వెయ్యి ముక్కలైపోయి మళ్లీ అతుక్కుంది. లైబ్రరీ సీన్‌లో చూపించే ఫక్కీలో అగ్ని పర్వతం బ్రద్దలై పొగలు చిమ్మే లావా బుస్సున జారి పొంగింది గుండెల్లో.

అదే కవరు... లోపల... అదే ఫొటో. కొద్ది రోజుల పాటు నా సూట్‌కేసులో దాచుకుని ఆరాధించినదే ఆ ఫొటో. ఒంటరిగా కూర్చుని గుసగుసలాడుతూ నేను ముద్దులు పెట్టుకున్నదే ఆ ఫొటో.

పువ్వుల చీర, తెల్లటి జాకెట్, ఒంటిపేట గొలుసు, కళ్లనిండా కాటుక, జారే నీటిచుక్కలా బొట్టు, చెవులకు బుట్టల జూకాలు, కెమెరాను చూసి నవ్వటం మరిచిపోయి, కళ్లు పెద్దవి చేసేసిన అమాయకత... వాడన్నట్లే నిజంగానే ఏడవాలనిపించింది ఆ ఫొటోని చూసి. మోసం, దగా, కుట్ర, అన్యాయం, అధర్మం... అదృశ్యంగా ఎవరో, ఎందరో రిథమిక్‌గా అరుస్తున్నారు నా చుట్టూ చేరి, నా చెవులు బద్దలయ్యేలా.

"ఇక చాల్లేరా. దిష్టి తగులుతుంది'' చటుక్కున లాక్కున్నాడు వాడు నా చేతిలోని ఫొటోని.

జనక మహారాజును కిందపడేసి పీకను రెండు చేతులతోనూ చుట్టి నలిపేస్తున్నాను నా వూహల్లో. ఆయనేమో నాలిక బైటకు చాపేస్తూ కాళ్లు తపతపా నేలకేసి కొట్టుకుంటున్నాడు భయంకరంగా. కానీ, పైకిమాత్రం అతి ప్రశాంతంగా అడిగాను "కట్నం ఎంతరా ఇంతకీ?''

వాడు మాట్లాడలేదు. భద్రంగా ఫొటోను కవర్లో పెట్టి, ఆ కవరు జేబులో పెట్టి అప్పుడు తల పైకెత్తి "ఏవిటన్నావు?'' అన్నాడు వాడు.

మళ్లీ అడిగాను నేను-


"ఓరి అజ్ఞానీ, మనం చేసిన ప్రమాణాలు అప్పుడే మరచిపోయావా? పైసా కట్నం లేకుండా పెళ్లిళ్లు చేసుకుందామని కదురా మనం అనుకున్నది'' అన్నాడు వాడు.

"అయితే నిజంగా కట్నం తీసుకోవడం లేదా?''

"నీమీద ఒట్టు. కానీ...''

"కానీ?''


"వాళ్లే ఏదో కానుకగా అంటూ... ఒక అర'' ఆగిపోయాడు తల దించు




## కంప్యూటరే గొప్ప

మనిషి మేధస్సు గొప్పదా? ఆ మనిషిచే సృష్టించబడిన కంప్యూటర్ గొప్పదా అని ఆలోచిస్తే కంప్యూటరే గొప్పదనిపిస్తోంది ఈ సంఘటనవలన. ఇంతకీ ఏం జరిగిందనుకున్నారు... ప్రతీసారీ చదరంగంలో గెలిచే ఆటగాడయిన లీడ్ జూనియర్ ఈసారి మనిషి సృష్టించిన కంప్యూటర్‌తో ఆడాడు. ఇజ్రాయిల్ సాఫ్ట్‌వేర్ గత రెండేళ్ళల్లో సాధించిన ప్రగతికి చిహ్నంగా కాస్పరో సాఫ్ట్‌వేర్ కంపెనీ కంప్యూటర్‌లో లీడ్ ఆడిన ఆటకు కంప్యూటర్ రెండువందల పై ఎత్తులువేసి ఇతడ్ని చిత్తుగా ఓడించింది. చూశారా! మనం సృష్టించిన ఈ కంప్యూటర్ ఎన్ని సంచలనాలు సృష్టిస్తోందో!

- శశి







## మంగళం

''మంగళం పాడడం ఎలాగో నేర్పిస్తారా మూర్తి గారూ?''

''తప్పకుండాను. ఇంతకీ నువ్వు దేనికి మంగళం పాడాలనుకుంటున్నావ్?''

''మీకివ్వాల్సిన బాకీకి.''

## తెలివి

''పక్కింటి పంకజం కట్టుకున్న ఆ పట్టు చీర భలే బావుంది కదండీ'' అంది విశాలాక్షి.

''స్వతహాగా అందంగాలేని వాళ్ళు అలాంటివి కట్టుకుని మురిసిపోతుంటారు. నీకా అవసరం ఏముంది చెప్పు?'' తెలివిగా అన్నాడామె భర్త.

– ఎం.ఐ.కిషన్ (మేడిబావి)

## నవల

''మీరు రాసిన ఈ నవలను రెండు సంవత్సరాల క్రితమే తిరస్కరించాను కదా. మళ్ళీ తీసుకువచ్చారేం?'' అని అడిగాడు ఎడిటర్.

''మీరు ఈ మధ్యకాలంలో ఎదిగి ఉంటారని అనుకున్నా'' చెప్పాడు రచయిత.

– వి.శ్యామ్‌కుమార్ (అస్సాం)



కుంటూ.

"అర?... అంటే?''

"అదేరా... అరలక్ష''

"అంటే కట్నం వద్దన్నావుకాని కానుకలు పుచ్చుకుంటున్నావన్నమాట''

"ఛ! నేనడగలేదురా. నాకిష్టం లేదు. కానీ మా నాన్న...''

"మీ నాన్నగారు అడిగారంటావ్.''

"ఔనురా. ఇక తీసుకోక తప్పలేదు. అయినా వాళ్ళు కూడా వాళ్ళమ్మాయి డబ్బుకు లోటు లేకుండా సుఖపడుతుందనేగా ఇస్తున్నారు.''

వాడు అంటున్న మాట విన్నాక నా ప్రమేయం లేకుండానే నా మనసు ఆ చివరి మాటను మూడు సార్లు రిపీట్ చేసింది.

నా ఆలోచనలు కొత్తదారి పట్టడంతో కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాను నేను. ఆపై అన్నీ పొడి పొడిగానే మాట్లాడుకుని లేచాము.

బరువెక్కిన గుండెతో రూముచేరి, తలుపు తీసేసరికి ఎదురుగా కనపడింది నాన్నగారు రాసిన కవరు. ఆత్రుతగా తీసి చదివాను.

"కన్నా'' ఇప్పటికీ ఇలానే సంబోధిస్తూ రాస్తారు మా నాన్నగారు.

కుశలాలు రాయటం పూర్తయ్యాక మా నాన్నగారు రాసిన మాటలు అక్షర లక్షలై తోచాయి నాకు.

"ఆదర్శం, ఆదర్శం అంటూ కట్నం వద్దని మారాం చేస్తావు నువ్వు. కానీ, లోకంలో ఎంతటి స్వార్థం పేరుకుపోయి వున్నదో, ఆ స్వార్థం ఎన్ని రూపాల్లో మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుందో నీకున్నపాటి జీవితానుభవంలో నువ్వు ఊహించుకోలేవు. వరకట్నం పేరుతో అమ్మాయి తల్లిదండ్రులను పీడించే స్వార్థపరులుగా మగపెళ్లివారిపై ముద్రవేసి, గుర్తించిందీ లోకం, దుమ్మెత్తిపోస్తుందీ లోకం. తమ స్వార్థం చూసుకుని ఎక్కువ కట్నం ఇచ్చేవారి పిల్లనే చేసుకుంటారని, ఆ ఎక్కువ 'ధర' దొరికేవరకూ సంబంధాలు ఒకదానివెంట మరొకటి చూస్తూ ఎందరో ఆడపిల్లల 'వుసురు' పోసుకుంటారని నిందిస్తుంది.

స్వార్థం ఎవరికి లేదురా కన్నా? నీకెదురైన ఈ అనుభవమే ఒక్కసారి పరిశీలించు. కట్నం వద్దని, నీకు అమ్మాయి అన్నివిధాలా నచ్చటమే ముఖ్యమని ఒక సదుద్దేశ్యంతోనే నువ్వా అమ్మాయిని చూశావు. నచ్చిందన్నావు. పెళ్లి చేసుకుంటానని ముందుకొచ్చావు. కానీ... సరిగ్గా నీ ఆదర్శాలతోనే ఇంజనీరు ఉద్యోగం చేసే మరొక అబ్బాయి కూడా ఇష్టపడ్డాడట వాళ్ల అమ్మాయిని చేసుకునేందుకు. వాళ్ల కళ్లెదురుగా మీ ఇద్దరూ నిలబడ్డారు ఒకే ఆదర్శంతో.. ఆదాయాలలో, వ్యత్యాసాలతో.. ఇప్పుడు వాళ్లకు అవకాశం దొరికింది. వాళ్లకీ స్వార్థం వుంది. ఆ స్వార్థం అప్పుడు బయటపడింది. మీ ఇద్దరి సంపాదనలు, ఆస్తిపాస్తులు, స్థితిగతులు బేరీజువేసి చూసుకున్నారు. మీ ఇద్దరి భవిష్యత్తును వూహించి, ఒకదానితో ఒకటి పోల్చి చూసుకున్నారు. మీ ఇద్దరినీ విడివిడిగా నిలబెట్టి వాళ్లమ్మాయిని ఒక్కొక్కరి పక్కన నిలబెట్టి చూసుకున్నారు. అన్నివిధాలా మెరుగైన స్థితిలో వున్న ఆ ఇంజనీరునే ఎంచుకున్నారు. నిన్ను పక్కకు తోసేశారు. అంతేకాదు, ఆ అబ్బాయికి 'ఇంత'ని రేటు కట్టారని కూడా తెలిసింది. కట్నం వద్దన్నావుగా నువ్వు. మరి కట్నం ఆశించని నిన్ను వాళ్లు ఎందుకు ఎంచుకోలేకపోయారు? ఆ అబ్బాయి తారసపడ్డాక వాళ్ల దృష్టిలో నీకున్న 'తక్కువ'తనాలు వాళ్ల కళ్లకు స్పష్టంగా కనిపించాయి. మరి ఇప్పుడేమయిందో చూశావుగా! కట్నం వద్దంటూ ఆర్థికంగా ఒక ఉన్నతుడూ, ఒక మధ్యముడూ ఎదురుగా నిలబడితే ఆ 'ఉన్నతుడినే' ఎన్నుకునే ఆడపెళ్లి వారికుండే స్వార్థం, వాళ్ల అమ్మాయి భవిష్యత్తు బంగారు బాటలో సాగాలనే స్వార్థం, అదే ఆ జంట బ్రతుకు హాయిగా సాగిపోవాలనే ఉద్దేశ్యంతో కట్నం డబ్బు ఎక్కువ ఇచ్చేవాళ్ల అమ్మాయినే చేసుకుందామనుకునే మగపెళ్లి వారికుండే స్వార్థం ఒకటి కావా? ఇరుపక్షాల వారిదీ స్వార్థమే అయినపుడు ఒకరి 'స్వార్థా'నికి సానుభూతి లభించడమేమిటి, మరొకరి 'స్వార్థం'పట్ల విపరీతార్థాలు ఏమిటి? ఇప్పుడు నీ విషయంలో జరిగింది ఒప్పా? నీకున్న అర్హతలకు సరిపడా నీకూ 'ఇంత'ని ధర నిర్ణయించుకో. ఆ డబ్బు మీ ఇద్దరి అవసరాలకే కాని మూడోమనిషి కోసం కాదుగా. తప్పని అనుకోకు. ఆలోచించరా కన్నా, ఆలోచించు. నిరుత్సాహపడకు. ఎదుటివాడు నీమీదకు విసిరే ఒక్కొక్క రాయినే నీ జీవిత పురోభివృద్ధికి పునాదిరాయిగా మార్చుకోవాలి. అదే తెలివైనవాడు చేయాల్సిన పని.''

ఆ ఉత్తరంలోని మాటలే నా చెవిలో వేదంలా వినిపించాయి. ఎదుటివారి పక్షంలో తప్పు కానిది, నా పక్షంలో మాత్రం తప్పని ఎందుకు అనుకోవాలి?

వెంటనే నాన్నగారికి ఉత్తరం రాసి పోస్టు చేశాను.

"ఇన్నాళ్లూ నా పిచ్చి ఆదర్శాలతో మిమ్మల్ని కాదన్నాను, బాధపెట్టాను. ఇక నిర్ణయించుకున్నాను... నాకూ వరకట్నం కావాలి'' అని.

★

